# వ్యాస కౌముది



## మనభారతం

**డా.వల్లూరుపల్లి శివాజీరావు**

86

*నా మాట: ప్రపంచ పాఠకులను విశేషంగా ఆకర్షించి, ఆకట్టుకుని, వారిచేత ఆదరించబడుచున్న, అసమాన తెలుగు మాస పత్రిక '**కౌముది**' లో ప్రచురితమైన నా '**మనభారతం**' వ్యాస సంపుటి జనవరి 2010 నుండి డిసెంబర్ 2015 వరకు నిరాటంకంగా 72 నెలలు ప్రచురితమయింది. కొంతకాలం విరామం తరువాత ఆగస్టు 2018 నుండి 10 సంచికలలో "**చేజారిన భారతదేశ రత్నరాజములు**" గురించి విపులంగా తెలియజేయటం జరిగింది. ఈ వ్యాసాలలో ఆంధ్రప్రదేశ్ లోని కొల్లూరు-పరిటాల వజ్ర గనులనుంచి వెలికి తీయబడిన వజ్రాలలో పశ్చిమ దేశాలకు తరలించబడిన కొన్ని అత్యద్భుత వజ్ర రాజముల గురించి విపులంగా తెలుసుకొనటం జరిగింది.*

*ప్రస్తుతం కొన్ని నెలల పాటు శాలివాహనులు, వారి సామ్రాజ్యం, రాజులు, ఇతర సంబంధిత విషయాల గురించి నా పరిశోధనల ఆధారంగా విపులంగా చర్చించటం జరుగుతోంది. ఈ వ్యాసాలను మీరు చదివి ఆనందిస్తారని భావిస్తున్నాను.*

# శాతవాహనులు - 4



*గత సంచికలో శూరుడు, విక్రమార్కుడు, అత్యంత సాహసోపేతుడు, 16 వ శాతవాహన రాజుగా 24 ఏళ్లపాటు వెలుగొందిన ఒకటవ పులమావి శాతకర్ణి క్రీ.పూ. 3 లో మరణించిన తదుపరి పర్షియా, మధ్య ఆసియా నుంచి విదేశీయులు ఉధృతంగా భారతావని మీద దండెత్తినందువల్ల శాతవాహన రాజ్యాన్ని సుమారు 25 ఏళ్ల పాటు బలహీనపరచినట్లు తెలుసుకున్నాము.*

***ఆతరువాత వచ్చిన కొంతమంది రాజులగురించి ఈ సంచికలో తెలుసుకుందాము.***

## హాల శాతకర్ణి (Hāla Sātakarni)

ఈ బలహీనపరిస్థితిలో 17వ శాతవాహన రాజుగా క్రీ.శ. 20 లో హాల శాతకర్ణి (పాలన: క్రీ.శ. 20–24) సింహాసనాన్ని అధిష్టించాడు. ఈయన శూరత్వానికి గాక, సాహిత్యానికి పేరొందాడు. సగటు వీరుడయిన ఈ మహారాజు 'శాక' రాజులమీద దండెత్తి గత శాతవాహన రాజులు దక్కన్ ప్రాంతంలో


పోగొట్టుకున్న కొంత భూభాగాన్ని స్వాధీనం చేసుకున్నాడు.

స్వతహా రచయిత అయిన హాల శాతకర్ణి మహారాష్ట్రి-ప్రాకృత భాషలో '**గాథ-సప్తశతి**' (Gātha-saptasati) అనే గ్రంధాన్ని రచయించాడు. ఈ మొట్టమొదటి ఆంధ్ర-దక్కన్ 'కవి-రాజు' ప్రాకృత భాషాభివృద్ధికి, సనాతన ధర్మ సాహిత్యానికి చాల కృషి చేసాడు.

ఈయన 700 ఏక చరణాలున్న (పాదాలు) ఈ గ్రంధాన్ని ప్రాకృత భాషకు దగ్గరగా ఉన్న మహా రాష్ట్ర-మాండలికంలో రచించాడు. శృంగారం మిళితమైన ఈ పద్యాలు ఆనాటి శాతవాహన కాలంలో ఉన్న సామాజిక పరిస్థితులకు దర్పణం పట్టాయి. పాండిత్యానికి, పండితుల పోషణకు విశేష కృషి చేసిన హాల శాతకర్ణి '**కవి వత్సల**' (patron of poets) అనే బిరుదును పొందాడు. ప్రస్తుత తెలుగు సాహిత్యంలో శతకములు చాలా ప్రసిద్ధం. కాని ఆకాలపు ఆంధ్ర-శాతవాహన తెలుగు సాహిత్యంలో కూడా శతకములు ప్రసిద్ధమైనవే!

క్రీ.శ. 800 లో ఒక పేరు తెలియని (అనామకుడు) నవలాకారుడు మహారాష్ట్రి-ప్రాకృత భాషలో 'లీలావతి పరిణయం' అనే శృంగార కావ్యం రచించాడు. ఇందులో రచయిత హాల శాతకర్ణి, 'సింహళ ద్వీప' (ఇప్పటి శ్రీలంక) రాజకుమారితో జరిపిన శృంగారం, ఆ తరువాత ఆమెతో జరిగిన పరిణయం ఈవిధంగా వివరించాడు.

ఈ శాతవాహనరాజు పరిపాలనాకాలంలో సేనాధిపతి 'విజయానంద' సింహళ ద్వీపం మీద జరిపిన దండయాత్రలో విజయం సాధించాడు. అయన తిరుగు ప్రయాణంలో మహారాష్ట్రలో 'సప్త గోదావరి భీమం' (Sapta Godavari Bhimam) అనే ప్రదేశంలో విశ్రమించాడు. ఆ సమయంలో అతి సౌందర్యవతిగా పేరొందిన సింహళ రాజకుమారి 'లీలావతి' గురించి తెలుసుకోవటం జరిగింది. ఈమె గురించి తనకు తెలిసిన విషయాలను ఈ విజయానంద తన రాజుకు విన్నవించాడు.




ఇది విన్న వెంటనే హాల శాతకర్ణి లీలావతిని సింహళ నుంచి తీసుకువచ్చి ఆమెను వివాహం చేసుకున్నాడు. ఆ తరువాత ఈయన ఎక్కువ కాలం జీవించలేదు.

## హాల శాతకర్ణి వారసులు

అయన తరువాత 5 గురు శాతవాహన రాజులయ్యారు. వీరు: 'మండలక శాతకర్ణి' (పాలన: 5 ఏళ్ళు); 'పురీంద్ర సేన శాతకర్ణి' (21 ఏళ్ళు); 'సుందర శాతకర్ణి' (1 సంవత్సరం); 'మహేంద్ర శాతకర్ణి' (1 సంవత్సరం); 'శివస్వామి శాతకర్ణి' (18 ఏళ్ళు). వీరందరు కలిసి 46 ఏళ్ళు పరిపాలించారు. బలహీనులైన ఈ అయిదుగురు రాజులు తమ విశాల సామ్రాజ్యాన్ని నిలుపుకోలేకపోయారు. తమ సామ్రా జ్యంలో ముఖ్య భాగమయిన 'మాళ్వ' రాజ్యాన్ని 'పశ్చిమ క్షత్రప' (Western Kshatrapa: శాక) రాజు 'నహాపన' (Nahāpana) కు కోల్పోయారు.

వీరి పాలన అంతమయ్యేటప్పటికి శాతవాహన సామ్రాజ్యం ఆంధ్ర భూభాగానికి, మహారాష్ట్రలో కొంతమేరకు మాత్రమే పరిమితమయింది.

## గౌతమీపుత్ర శాతకర్ణి

46 ఏళ్ళు అనామక రాజులుగా మిగిలిపోయిన ఈ అయిదుగురు రాజుల తరువాత 'గౌతమీపుత్ర శాతకర్ణి' 23 వ రాజుగా శాతవాహన క్రీ.శ. 70 లో సింహాసనమెక్కాడు. 22వ రాజు 'శివస్వామి శాతకర్ణి' అయన భార్య 'గౌతమి బాలశ్రీ' పుత్రుడయిన గౌతమీపుత్ర అత్యంత కీర్తివంతులయిన, శక్తివంతులయిన శాతవాహన రాజులలో ఒకడుగా ప్రసిద్దికెక్కాడు.

'గౌతమి-పుత్ర' అనే నామానికి ఒక కారణం ఉంది. ఆ రోజులలో రాజులకు అనేకమంది భార్య లుండేవారు. అందువల్ల ఒక రాజకుమారుడు తన తల్లి పేరుతో గుర్తించబడతాడు. గౌతమీపుత్ర శాతకర్ణికి ముందు, అయన తరువాత వచ్చిన కొందరు శాతవాహన రాజులలో మాతృక-నామావళి (matronymic) సంప్రదాయం అనుసరించబడింది. అంతేగాని ఇది మాతృస్వామ్యం (matriarchy) వ్యవస్థ కాదు.

ఈయన రాజైనప్పుడు 'కుషాణులు' (సంచార చైనీయులు) గంగ పరీవాహప్రాతంలోనూ, 'పశ్చిమ క్షత్రపాలు' (Western Kshatrapās) దక్కన్ ప్రాంతంలోనూ, పర్షియా నుంచి వచ్చిన 'పహ్లావులు' దక్షిణ భూభాగంలోనూ వ్యాపించారు, లేక వ్యాపించటం ప్రారంభించారు. వీరందరూ భారతావనిలో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్నారు. ఈ పరిస్థితులను సహించలేక గౌతమీపుత్ర శాతకర్ణి మొదట ఈ యవనులను (విదేశీయులను) చాలావరకు పతనం చేసాడు. ఈ పహ్లావులే తరువాత కాలంలో పల్లవు లుగా ప్రసిద్ధిచెంది దక్షిణ భారతావనిని కొన్ని వందల ఏళ్ళు పరిపాలించారు.

ఆ తరువాత వింధ్యప్రాంతంలో మాహిష్మతి రాజ్యానికి చెందిన 'అనూప', దాని సరిహద్దులలో ఉన్న కొంత భూభాగాన్ని; ఉత్తర కొంకణి ప్రాతంలోని 'అపరాంత' (Aparantha)ను; సౌరాష్ట్రను; రాజస్థాన్ లోని 'కుక్ర' (Kukra) ప్రాంతాన్ని; పశ్చిమ మధ్యప్రదేశ్ లోని 'అవంతి' ని జయించాడు. ఈ క్రమంలో పశ్చిమ క్షాత్రప వంశంలో ని 'క్షహారత' (Kshaharata) శాఖను సమూలంగా నాశనం చేసాడు.



ఆ తరువాత విదర్భ (Vidarbha); 'అశ్మక' (Asmaka/Assaka; ఇది వింధ్య ప్రాతంలోని గోదావరి-మంజీరా నదులమధ్య ఉన్న ప్రదేశం); 'ములుక' (Muluka: ఇది ఇప్పటి మహారాష్ట్రలోని ఔరంగాబాదు, నాసిక్, జాల్నా, వాషిమ్, వగైరా) ను జయించాడు.

ఈ వరుస విజయాలతో గౌతమీపుత్ర శాతకర్ణి తన సామ్రాజ్యాన్ని దక్షిణాపథంలో ఆంధ్ర లోని కృష్ణానది నుంచి ఉత్తరావనిలో 'పశ్చిమ మాళ్వా', 'కథియవార్' (గుజరాత్) వరకు; తూర్పువైపున బంగాళా ఖాతం (కళింగతో సహా) నుంచి పశ్చిమాన అరేబియా సుముద్రతీరాన కొంకణ వరకు విస్తరిం చాడు.

ఈయనకు 'త్రిసముద్ర తోయ పితావాహాబ్న' (One whose horses drink waters of three oceans) అనే బిరుదు ఉంది. దీని అర్థం: ఈయన సైన్యాలు మూడు సముద్రాలను (బంగాళాఖాతం, అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రం) స్పృశించాయని సూచిస్తుంది. ఈ శాతవాహన చక్రవర్తి 'శాక' లను, పహ్లావలను (Pahalavas), యవనులను (Yavanas), నాశనం చేసినవాడు అని అప్పటి చరిత్రకారులు వర్ణించారు: {Destroyer of the Shaka, Pahalava and Yavana Power}. ఈయనకు 'దక్షిణ-సముద్రేశ్వ రుడు' (God of Southern Oceans) అనే బిరుదుకూడా ఉంది.

గౌతమీపుత్ర శాతకర్ణి కి 'రాజ-రాజ' (King of Kings), మహారాజ (Great King), వింధ్య ప్రభువు (Lord of Vindhya). ఈ రారాజు అనేక విజయాలతో శాతవాహన వంశపు కీర్తిని పునరుద్ధరించాడు.

ఈయన తన రేఖాచిత్రాన్ని నాణెములమీద ముద్రించిన మొట్టమొదటి ఆంధ్ర పాలకుడిగా చరిత్రలో ప్రసిద్ధికెక్కాడు. తాను పరాజితుడ్ని గావించిన పశ్చిమ క్షత్రప రాజు 'నహపన' (Nahapana) ముఖం ముద్రించబడిన నాణెముల మీద తన ముఖాన్ని ముద్రించాడు. గౌతమీపుత్ర శాతకర్ణి నాణెములు వాటిని ముద్రించిన ముద్రణ పరికరాలు కొన్ని ఏళ్ల క్రిందట నాగార్జున కొండలో బయల్పడ్డాయి.



నిర్భయుడు, విక్రమశాలి అయిన ఈ శాతవాహన రారాజు రెండు అశ్వమేధయాగాలు విజయ వంతంగా నిర్వహించాడు. ఈయన బౌద్ధమతాన్ని ప్రోత్సహించి బౌద్ధ సన్యాసులు స్థిరపడడానికి భూమిని ఏర్పాటు చేసాడు. 'హీనయాన బౌద్ధశాఖకు సంభందించిన 'భద్రాయనీయ' (Bhadrayaniya) వర్గానికి చెందిన సన్యాసులకు ఒక గ్రామాన్ని బహూకరించాడు.

ఉజ్జయిని మహారాజు, ఆకాలంలో ఈనాటి సౌదీ అరేబియాను పరిపాలించినవాడు, శాక (Saka) రాజులను జయించినవాడు, క్రీ.శ. 57 లో విక్రమ్ సంవత్ (Vikram Samvat) శకాన్ని ప్రారంభించినవాడు అయిన 'విక్రమాదిత్య'ను క్రీ.శ. 78 లో గౌతమి పుత్ర శాతకర్ణి పరాజితుడిని గావించాడు. ఈ ఘనమైన విజయానికి దర్పణంగా, ఘనచరిత్ర కలిగిన విక్రమాదిత్యను తొలి ఓటమి పాలు చేసినందుకు చిహ్నంగా ఈ శాలివాహనుడు (ఉరఫ్: శాతవా హనుడు) ఆ సంవత్సరం (క్రీ.శ. 78) లో '**శాలివాహన**' **శకాన్ని** ప్రారంభించాడు. 1941 ఏళ్ల క్రితం ప్రారంభ మైన ఈ శాలివాహన శకాన్ని ఈరోజుకూ తెలుగు, కన్నడ, మరాఠీ ప్రజలు అనుసరిస్తారు.

ఈయన సుమారు 25 ఏళ్ళు పరిపాలించి, చిన్న వయస్సులోనే మృతి చెందాడు. చివరలో కొన్ని ఏళ్ళు అనారోగ్యకారణంగానూ, దండయాత్రల కారణంగానూ ఆయన తల్లి గౌతమి బాలశ్రీ తెర వెనక నుంచి పరిపాలన నిర్వహించింది.

మహారాష్ట్రలోని 'నాసిక్'లో ఉన్న 'పండవలెని' (Pandavleni) గుహలలో క్రీ.శ. 1వ శతాబ్దానికి చెందిన ఒక శిలాశాసనం ఉంది. గౌతమి బాలశ్రీ తన కుమా రుడు (గౌతమీపుత్ర శాతకర్ణి) సాధించిన ఘన విజయాలను ఈ శిలాశాసనంమీద అయన మరణం తరువాత 20 ఏళ్లకు చెక్కిం చింది. అది ఈవిధంగా ఉంది:

*"ఈయన క్షత్రియుల గర్వాన్ని, అహంకారాన్ని అణగ దొక్కాడు .....ఈయన 'శాక' రాజుల (పశ్చిమ క్షత్రపలు), 'యవనుల' (Indo-Greeks), 'పహ్లావుల' (Indo-Pārthians), తదితరులను నాశనం చేసాడు ......క్షహారత (Kshaharata) కుటుంబాన్ని ('నహపన'కు చెందినది) వ్రేళ్ళతో పెకిలించి వేసాడు. .....శాతవాహన వంశం కీర్తిని పునరుద్ధరించాడు."* ...............

***వచ్చే సంచికలో 'వశిష్టీపుత్ర పులుమాయి'; 'వశిష్టీపుత్ర శాతకర్ణి', 'శివశ్రీ పులుమాయి', 'శివస్కంద శాతకర్ణి', 'యజ్ఞశ్రీ శాతకర్ణి' ల గురించి తెలుసుకుందాం.***

**మీ అభిప్రాయాలను పంపించేందుకు నా ఇ-మెయిల్: dr_vs_rao@yahoo.com**

COMMENTS